
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
సోమవారం 7 జూలై 2025





సిద్దిపేటలో షర్బత్ పంపిణీ చేస్తున్న ముర్షద్‌గడ్డ యువత

సంగారెడ్డి మొహర్రంలో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మొహర్రం కార్యక్రమాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ఆయా విధుల్లో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో ఆయన పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన జగ్గారెడ్డిని ముస్లిం మత గురువులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మొహర్రంను పురస్కరించుకొని నిర్వహించే పీర్ల ఊరేగింపులో ప్రతీ ఏటా పాల్గొంటానని స్పష్టం చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా ప్రజలు మొహర్రంను జరుపుకుంటారని తెలిపారు. అన్నీ మతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని మతసామరస్యాన్ని చాటుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షఫియొద్దీన్ పాల్గొన్నారు.





సంగారెడ్డిలో జరిగిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో పీర్ల ఊరేగింపు

మతాలకతీతంగా పీర్ల ఊరేగింపు

సిద్దిపేట కల్చరల్/జగదేవ్‌పూర్/వర్గల్/చేర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జగదేవ్‌పూర్, వర్గల్, చేర్యాల మండలాలతో పాటు సిద్దిపేట పట్టణంలో ఆదివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో, మతాలకతీతంగా నిర్వహించారు. జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్, ఇటిక్యాల, తీగుల్, అలిరాజ్‌పేట, జగదేవ్‌పూర్, చాట్లపల్లి గ్రామాల్లో పీర్లను పూలమాలలతో అలంకరించి, దట్టీలు కట్టి డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దౌలాపూర్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు చిలకూరి చిన్న, మహిపాల్ రెడ్డి షర్బత్ పంపిణీ చేశారు. వర్గల్ మండలంలోని వర్గల్, మైలారం, నెంటూర్, తునికిఖాల్సా, మజీద్‌పల్లి, నాచారం గ్రామాల్లో పీర్ల ఊరేగింపులు జరిగాయి. ప్రజలు పీర్లకు కుడుకలు, బెల్లం, దట్టీలు సమర్పించారు. చేర్యాలలోనూ భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. సిద్దిపేటలోని ముర్షద్ గడ్డ యువత షర్బత్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

మద్రాస్ ఐఐటీతో జక్కాపూర్ పాఠశాల భాగస్వామ్యం

విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సులు

సిద్దిపేట రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న నారాయణరావుపేట మండలం, జక్కాపూర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్రాస్ ఐఐటీ నిర్వహిస్తున్న స్కూల్ కనెక్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపికైంది. ఈ భాగస్వామ్యం ద్వారా పదో తరగతి విద్యార్థులు రాబోయే రెండేళ్ల పాటు ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్లచే ఆన్‌లైన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా సైన్స్ వంటి ఫౌండేషన్ కోర్సుల ప్రాథమికాంశాలు, కోడింగ్‌ను నేర్చుకోనున్నారు. ఇది విద్యార్థులకు ఐఐటీలో చేరడానికి అవసరమైన ప్రాథమిక జ్ఞానాన్ని అందిస్తుంది. ఈ అవకాశంతో విద్యార్థులు మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటారని ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ తెలిపారు. భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు రాజేందర్ కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.



జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పర్యావరణ పరిరక్షణకు క్విజ్

- ఎన్ఎస్‌పీఎస్-2025 రిజిస్ట్రేషన్లు షురూ
- ఐదు విభాగాల్లో ఆన్‌లైన్ క్విజ్
- ఆగస్టు 21 వరకు నమోదుకు అవకాశం
- జిల్లావ్యాప్తంగా విద్యాశాఖ అవగాహన కార్యక్రమాలు

7



కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్న నాయకులు 18 నెలలుగా ఎదురుచూస్తున్నారు. గతంలో చాలాసార్లు భర్తీ ప్రక్రియ అంటూ ఆశలు రేపి, చివరికి నిరాశపరిచిన సందర్భాలున్నాయి. షార్ట్‌లిస్ట్ చేసిన పేర్లకు ఏడాది గడిచినా మోక్షం లభించలేదు. స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిని పదవులను త్వరగా భర్తీ చేయాలని ఆదేశించడంతో, ఈసారైనా ప్రక్రియ కొలిక్కి వస్తుందా అని పార్టీ శ్రేణులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మళ్లీ 'నామినేటెడ్' ఆశలు

ఖర్గే గ్రీన్‌సిగ్నల్‌తో కాంగ్రెస్ నాయకుల్లో కొత్త ఉత్సాహం

- 'స్థానిక' ఎన్నికలలోపే భర్తీకి చర్యలు
- సుడా, మార్కెట్, ఆలయాలు, ఆత్మ కమిటీలకు మోక్షం
- పదవులు కష్టపడ్డవారికా.. వలస వచ్చినవారికా ?

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 6 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 18 నెలలు గడుస్తున్నా, సిద్దిపేట జిల్లాలో నామినేటెడ్ పదవుల భర్తీపై అనిశ్చితి కొనసాగింది. అయితే, ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర మంత్రులు, నేతలతో నిర్వహించిన సమావేశంలో నామినేటెడ్ పదవుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. పదవులు ఆశిస్తున్న వారి పేర్లను షార్ట్‌లిస్ట్ చేయాలని ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా మంత్రులకు ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి సూచించడంతో ఈ దిశగా కసరత్తు ముమ్మరమైంది.

భర్తీ కానున్న కీలక పదవులు

సిద్దిపేట జిల్లాలోని చేర్యాలకు మార్కెట్ కమిటీని ఇదివరకే భర్తీ చేయగా, గజ్వేల్ మార్కెట్ కమిటీకి సంబంధించి ఇంకా పూర్తిస్థాయి నియమాకాలు జరగలేదు. సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్‌తో పాటు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీని ప్రభుత్వం నియమించింది. కాగా, సిద్దిపేట చుట్టూ 26 గ్రామాలకు పరిమితమైన సుడా (సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ని ఇటీవల జిల్లా మొత్తంగా విస్తరించడంతో ఈ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ నెలకొంది. త్వరలోనే సుడాతో పాటు, జిల్లావ్యాప్తంగా ఉన్న మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలు, ఆత్మ కమిటీలు పూర్తిస్థాయిలో భర్తీ కానున్నాయి.

స్థానిక ఎన్నికల్లోగా భర్తీకి చర్యలు

హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఈలోపే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తే, పదవులు దక్కినవారు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మరింత కృషి చేస్తారని అధిష్ఠానం భావిస్తోంది. ఈ అంశం శుక్రవారం ఖర్గేతో జరిగిన సమావేశంలో ప్రస్తావనకు రావడంతో, త్వరితగతిన పేర్లను ఖరారు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు ఆదేశాలు జారీ అయ్యాయి. డీసీసీ, మండల అధ్యక్షులు, బ్లాక్ ప్రెసిడెంట్లు, పట్టణ అధ్యక్షులు, మహిళా కమిటీలు, సోషల్ మీడియా కన్వీనర్లు వంటి పార్టీ పదవులను ఈ నెలాఖరులోపు ప్రకటించే అవకాశాలున్నాయి.

సిద్దిపేటకు మొండిచెయ్యేనా

నామినేటెడ్ పదవుల భర్తీ అంశం వచ్చిన ప్రతిసారీ సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు మొండిచేయే ఎదురవుతున్నది. కష్టకాలంలో పార్టీని నమ్ముకొని పనిచేసిన స్థానిక

మిగతా 8వ పేజీలో

సార్వత్రిక సమ్మెకు సై

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై 9న నిరసన

సిద్దిపేట అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9న పిలుపునిచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్దిపేట జిల్లా సిద్ధమైంది. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, కార్పొరేట్ సంస్థలకు కార్మికుల శ్రమను దోచిపెట్టే ప్రయత్నాలు చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలోని 5,09,563 మంది శ్రామిక జనాభాలో, సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన బీడీ కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, వ్యవసాయ కూలీలు, స్కీం వర్కర్లు, ఆర్టీసీ, హోటల్, ప్రైవేట్ ఆసుపత్రులు, కిరాణా, షాపింగ్ మాల్స్, ఇటుక బట్టీల కార్మికులు, వివిధ వాహనాల డ్రైవర్లు, వలస కార్మికులు, ప్రైవేట్ పరిశ్రమలు, సెక్యూరిటీ గార్డులు సహా అనేక రంగాల కార్మికులు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ వంటి ప్రధాన కార్మిక సంఘాలు సమ్మెను విజయవంతం చేయడానికి కరపత్రాల పంపిణీ, సమావేశాలు నిర్వహిస్తూ కార్మికులను సమాయత్తం చేస్తున్నాయి. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చే విధానాన్ని విరమించుకోవాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రవాణా రంగ కార్మికులకు శాపంగా మారిన జీవో నంబర్ 21ని రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కార్మికులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే యాజమాన్యాలకు సమ్మె నోటీసులు కూడా అందజేశారు.



కార్మికులకు కరపత్రాలను అందజేస్తున్న కార్మిక సంఘ నాయకుడు

కార్మిక హక్కులను కాపాడుకుంటాం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్ స్పష్టం చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. బడా కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడతామని తెలిపారు. ఈ నెల 9న జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిద్దిపేటకు చెందిన ఒక మహిళ ఇటీవల ఓ ఫోన్ యాప్‌లో రూ.900 లోన్ తీసుకుంది. వారం తర్వాత రూ.1600 చెల్లించినప్పటికీ, ఒక సైబర్ నేరస్థుడు ఆమెకు ఫోన్‌చేసి మరో రూ.5000 చెల్లించాలని బెదిరించాడు. అంతేకాకుండా, ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లో పంపించి మరింత భయపెట్టాడు. ఆ మహిళ వెంటనే సఖీ కేంద్రాన్ని ఆశ్రయించింది. ఇక్కడి సిబ్బంది ఆలస్యం చేయకుండా సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేసి వివరాలు తెలియజేశారు. కేంద్రం చొరవతో ఆ మహిళ సమస్య పరిష్కారమై, నిశ్చింతగా ఇంటికి వెళ్లింది.

దుబ్బాక మండలంలో ఓ గ్రామానికి చెందిన ఒక మహిళను ఆమె భర్త రోజూ వేధిస్తూ, కొట్టేవాడు. భరించలేక ఆమె తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. విచిత్రంగా భర్త తల్లి తన కోడలిపై, మనవరాళ్లపై ఆస్తి మొత్తం రాయాల్సిందేనని, అప్పుడే కాపురానికి వస్తారని వుమెన్ కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసు కలెక్టరేట్ ద్వారా సఖీ కేంద్రానికి చేరడంతో, కేంద్రం సిబ్బంది వెంటనే ఆ మహిళను, ఆమె భర్తను, అత్తను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. భర్త తన తల్లికి తెలియకుండానే తప్పుడు ఫిర్యాదు చేశాడని తేలడంతో, సఖీ కేంద్రం ఆ కుటుంబాన్ని హెచ్చరించి, సమస్యను పరిష్కరించింది.

సిద్దిపేటకు చెందిన మహిళ తన భర్త, అత్త వేధింపులు భరించలేక పిల్లలతో సహా విడిగా ఉంటోంది. తన పిల్లలను స్కూల్లో చేర్పడానికి అవసరమైన ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు అత్తవారింట్లో ఉండిపోవడంతో ఆందోళన చెందింది. ఆ మహిళ సఖీ కేంద్రాన్ని ఆశ్రయించింది. సఖీ సిబ్బంది వెంటనే ఆమె అత్తగారింటికి వెళ్ల, వస్తువులను, పిల్లల సర్టిఫికెట్లను తీసుకువచ్చి ఆమెకు అప్పగించారు.

ఈ విధంగా బాధిత మహిళలకు సిద్దిపేట సఖీ కేంద్రం నిరంతరం అండగా నిలుస్తోంది. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, టోల్ ఫ్రీ నంబర్ 181కు కాల్ చేయడంతోనే సఖీ కేంద్ర సిబ్బంది స్పందించి, బాధితులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఈ సఖీ కేంద్రం ప్రస్తుతం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ప్రకృతి పర్యావరణ సంస్థ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతోంది.

ఆపదలో సఖీ భరోసా

- మహిళల సమస్యలకు అండగా సఖీ కేంద్రం
- సైబర్ వేధింపుల నుంచి కుటుంబ కలహాల వరకు అన్నింటికీ పరిష్కారం
- ఆరు వసంతాలు పూర్తి చేసుకుని, ఏడో యేట అడుగుపెట్టిన సేవలు
- ఉచిత కౌన్సెలింగ్, వైద్యం, న్యాయ సాయం, తాత్కాలిక వసతికి చర్యలు



సిద్దిపేట క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు, భర్త వేధింపులు, కుటుంబ కలహాలు, లైంగిక వేధింపులు లేదా పని చేసే చోట ఎదురయ్యే వేధింపులతో బాధపడుతున్న వారు సఖీ కేంద్రాన్ని ఆశ్రయించవచ్చు. మహిళలు టోల్ ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేసినా లేదా కేంద్రాన్ని నేరుగా సందర్శించినా, సఖీ కేంద్రం వారి సమస్యలను పరిష్కరించి ఇంటికి పంపిస్తుంది. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న వారికి ఐదు రోజులపాటు తాత్కాలిక వసతితో పాటు నిత్యావసర వస్తువుల కిట్‌ను అందిస్తుంది. భరోసా కేంద్రం నుంచి వచ్చే పోక్సో కేసుల బాధితులు సహా, మేజర్ మహిళలకు, సమస్యలతో ఇల్లు వదిలి వచ్చిన వారికి, ఇష్టం లేని పెళ్లి ప్రయత్నాల నుంచి తప్పించుకోవాలనుకునే వారికి కౌన్సెలింగ్ ఇస్తుంది. మైనర్ వివాహాల్లో తల్లిదండ్రులు మిస్సింగ్ కేసు నమోదు చేసినప్పుడు, సఖీ కేంద్రం మైనర్లకు వసతి కల్పించి, కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగిస్తుంది. వృద్ధ తల్లిదండ్రులను పట్టించుకోని కౌన్సెలింగ్ అందిస్తూ, అవసరమైతే వారిని వృద్ధాశ్రమాలకు తరలిస్తుంది. పట్టణాల్లో, గ్రామాల్లో మతిస్థిమితం లేకుండా తిరిగే మహిళల గురించి

ఆరేళ్లలో 1535 కేసులు

జిల్లాలో సఖీ కేంద్రం ఏర్పాటు చేసిన ఆరేళ్లల్లో 868 గృహహింస, 111 వరకట్న వేధింపులు, 112 లవ్ చీటింగ్, 144 మిస్సింగ్ -కిడ్నాప్‌లు, 58 పోక్సో, 23 బాల్యవివాహాలు, 219 వివిధ రకాల కేసులు మొత్తం 1535 కేసులు నమోదయ్యాయి. వాటిలో 1387 కేసులు పరిష్కరించారు. 148 కేసులు ఇంకా పరిశీలనలో ఉన్నాయి. ఇప్పటివరకు 1523 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి మనోధైర్యాన్ని నింపారు. 647 మందికి ఉచిత న్యాయ సలహా, 308 మందికి ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉచిత వైద్యం, 197 మందికి పోలీస్ సపోర్టు అందించారు. సఖీ కేంద్రంలో ఇప్పటివరకు 841 మందికి తాత్కాలిక వసతిని కల్పించి వారిలో 301 మందికి నిత్యావసరాల వస్తువుల కిట్టును అందించారు.

మిగతా 8వ పేజీలో



తొగుట మండలం వెంకట్రావ్‌పేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

తొలి ఏకాదశి శోభ

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలో ఆధ్యాత్మిక శోభ నెలకొన్నది. విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ రోజున భక్తులు వైష్ణవాలయాలకు పోటెత్తారు. ఉత్సాహంగా పారాయణలు, పూజలు నిర్వహించి తరించారు.

జిల్లాలో 27 మంది ఎస్ఐల బదిలీ

సిద్దిపేట క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న 27 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి సీసీఆర్‌బీకి, వీఆర్‌లో ఉన్న రాజేష్ సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు, రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసిఫ్ సిద్దిపేట టూటౌన్‌కు, కరీంనగర్ వీఆర్ ఎస్ఐ వివేక్ రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ సిద్దిపేట సీఎస్‌బీకి, అండర్ ట్రైనింగ్‌లో ఉన్న మహమ్మద్ షఫీ అలీ చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అలాగే, బెజ్జంకి ఎస్ఐ తిరుపతిరెడ్డి సిద్దిపేట వన్‌టౌన్‌కు, అండర్‌ట్రైనింగ్‌లో ఉన్న సౌజన్య బెజ్జంకి పోలీస్ స్టేషన్‌కు స్థానచలనం పొందారు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు సిద్దిపేట సీసీఆర్‌బీకి, అండర్ ట్రైనీ కీర్తి రాజు దుబ్బాకకు బదిలీఅయ్యారు. సిద్దిపేట వీఆర్ ఎస్ఐ కృష్ణారెడ్డి జగదేవ్‌పూర్‌కు, జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ సిద్దిపేట సీఎస్‌బీకి మారారు. దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రదీప్ గజ్వేల్‌టౌన్‌కు, అండర్ ట్రైనీ అరుణ్‌కుమార్ దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. రాయపోల్ ఎస్ఐ రఘుపతి గజ్వేల్‌టౌన్‌కు, అండర్‌ట్రైనీ మానస రాయపోల్ పోలీస్‌స్టేషన్‌కు స్థానచలనం పొందారు. హుస్నాబాద్ ఎస్ఐ మహేష్ సిద్దిపేట సీఎస్‌బీకి, కరీంనగర్ రూరల్ ఎస్ఐ లక్ష్మారెడ్డి హుస్నాబాద్‌కు, చేర్యాల ఎస్ఐ నిరీష్ సిద్దిపేట ట్రాఫిక్‌కు, అండర్ ట్రైనీ నవీన్ చేర్యాలకు, అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్ సిద్దిపేట ట్రాఫిక్‌కు, అండర్‌ట్రైనీ ప్రశాంత్ అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌కు మారారు. మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు సిద్దిపేట పీసీఆర్‌కు, అండర్ ట్రైనీ సమత మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌కు, సిద్దిపేట వీఆర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సిద్దిపేట సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

నేడు హుస్నాబాద్‌కు మంత్రి వాకిటి శ్రీహరి

హుస్నాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు క్రీడలు, పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం మధ్యాహ్నం హుస్నాబాద్‌లో పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. వీరితో పాటు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి వస్తున్నారని చెప్పారు. వీరు హుస్నాబాద్‌లోని మినీ స్టేడియాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. యువకులు, క్రీడాకారులు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

అదృశ్యం కేసులో తల్లి, కూతురు ఆచూకీ లభ్యం

● తండ్రి కోసం వెతుకుతున్న పోలీసులు, కుటుంబీకులు

రామాయంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిన దంపతుల్లో భార్య, కూతురు ఆచూకీ లభించింది. భర్త జాడ దొరకలేదు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిలాపూర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, ప్రియ శనివారం సాయంత్రం గొడవ పడ్డారు. అదేరోజు రాత్రి ప్రేమ్‌కుమార్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ప్రియ తన మూడేళ్ల కూతురును తీసుకుని ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో ప్రేమ్‌కుమార్ తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ప్రియ తన పాపతో తల్లిగారి ఊరైన జనగామలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రేమ్ కుమార్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు, పోలీసులు వెతుకుతున్నారు.

సిగాచి యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలి

● హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి

● జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు

పటాన్‌చెరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి) : సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలని, మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం, బీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారయ్య, టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బోస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి అనంతరం పరిశ్రమ సందర్శించారు. పోలీసులు అడ్డుకోవడంతో పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆ తర్వాత పోలీసులు వారిని లోనికి అనుమతించారు. అక్కడే ఉన్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో మాట్లాడారు. అందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తామని నాయకులతో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలను తనిఖీ చేయకుండా యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాల్లో మార్పులు చేస్తున్నారన్నారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే పరిశ్రమ వద్ద ఐఎన్‌టీయూసీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యుల బృందం ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడారు. పరిశ్రమను సందర్శించిన వారిలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ, కార్యదర్శి ఉప్పల శ్రీకాంత్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, పలువురు ఉన్నారు.



పరిశ్రమ వద్ద పోలీసులతో మాట్లాడుతున్న నాయకులు

ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై దాడి

● ముగ్గురు యువకులపై కేసు

సిద్దిపేట క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన సంఘటన సిద్దిపేటలో ఆదివారం చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ డిపోకు చెందిన టీఎస్ 02 యూసీ 5434 నంబర్ గల ఆర్టీసీ బస్సు ఆదివారం వేములవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుంది. గుర్రాలగొంది స్టేజీ లో బస్సును కొంచెం ముందుకు ఆపి ప్రయాణికులకు ఎక్కించుకునే క్రమంలో ఒకతను బూతులు తిడుతూ దాడి చేసే ప్రయత్నం చేస్తే ప్రయాణికులు అతన్ని వారించారు. కాసేపటికి అతను బస్సు దిగాడు. గుర్రాలగొంది నుంచి సిద్దిపేట కొత్త బస్టాండ్‌కు వచ్చే సరికి గుర్రాలగొందికి చెందిన ముగ్గురు యువకులు పి.గణేష్, ఎన్.నగేష్‌గౌడ్, ఎస్.సతీష్ మద్యం మత్తులో బస్సు డ్రైవర్‌ను కొట్టారు. ఇదంతా వీడియో తీస్తున్న కండక్టర్ కొమురయ్యపై కూడా దాడి చేసి అతని మొబైల్ పగలగొట్టారు. విషయం తెలుసుకున్న కంట్రోలర్ యాదయ్య, సెక్యూరిటీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదు చేశారు.

హుస్నాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలి

హుస్నాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అత్యధికంగా క్రీడాకారులున్న హుస్నాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దీని కోసం కృషి చేయాలన్నారు. హుస్నాబాద్ ప్రాంతం నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులున్నారని, విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయడమే కాకుండా ఇక్కడి మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలన్నారు.

గోడను ఢీకొట్టి ఇద్దరు యువకులు మృతి

● పల్సర్‌పై ఓవర్ స్పీడ్, మద్యం మత్తే కారణం!

● పండుగ పూట తంగళ్లపల్లిలో విషాదం

కోహెడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. గ్రామానికి చెందిన బోదాసు శ్రీకాంత్ (22) దామెర రిషి (15) పల్సర్‌పై తంగళ్లపల్లి గ్రామం నుంచి కోహెడకు వెళ్తుండగా ఊరి చివర ఉన్న ఓ ఇంటి గోడను వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వర్షం పడుతుండడం, మద్యం మత్తులో ఓవర్ స్పీడ్‌గా వెళ్లడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. ఏకాదశి రోజు ఇద్దరు యువకులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విహారయాత్రలో విషాదం

● నీట మునిగి యువకుడి మృతి

● నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలో ఘటన

● మృతుడు సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌వాసి



అనిల్ కుమార్

నేరేడుగొమ్ము, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన విహారయాత్రలో విషాదం నెలకొన్నది. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ కృష్ణా పరివాహక ప్రాంతంలో నీటి మునిగి యువకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం తెల్లాపూర్ గ్రామానికి చెందిన మచ్చికల అనిల్‌కుమార్(23) డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తొలి ఏకాదశి పర్వదినం, ఆదివారం సెలవు రోజు కావడంతో అదే గ్రామానికి చెందిన స్నేహితులు దుర్గా ప్రసాద్, గణేష్‌తో కలిసి కారులో ఆదివారం తెల్లవారుజామున నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీకి చేరుకున్నారు. కొద్దిసేపు కారులో విశ్రాంతి తీసుకుని అనంతరం అక్కడే పర్యాటక ప్రాంతాలను వీక్షించారు. ఈత కోసం కృష్ణా పరివాహక ప్రాంతానికి వెళ్లారు. అనిల్‌కుమార్ కొద్దిదూరం వెళ్లాక నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన మిత్రులు ఆందోళనతో కేకలు వేయడంతో మత్స్యకారులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం అనిల్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోదరుడు మృతిచెందాడని తెలుసుకున్న అనిల్ సోదరులు శద్రక్, జాన్సన్ దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుల సోదరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. విహారయాత్రకు స్నేహితులతో కలిసి వచ్చి కృష్ణానదిలో నీట మునిగి మృతి చెందడంతో మిత్రులతోపాటు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని సాగు చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధి

● అడ్డుకున్న గ్రామస్థులు.. అధికారులకు ఫిర్యాదు

కొల్చారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని ఓ ప్రజాప్రతినిధి సాగు చేస్తుండడంతో గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. కొల్చారం మండలం రాంపూర్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి గతంలోనే ప్రభుత్వ భూమిలో సాగు చేస్తుండడంతో గ్రామస్థులు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు మూడు నెలల క్రితం తహసీల్దార్ ఆధ్వర్యంలో సుమారు ఆరు ఎకరాలకు సంబంధించి "ఇది ప్రభుత్వ భూమి. ఎవరూ సాగు చేయవద్దని బోర్డులను పాతారు." అయినా కూడా సదరు ప్రజాప్రతినిధి ఆదివారం మరోసారి ఆ భూమిలో ట్రాక్టర్‌తో చదును చేయడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. వారిపై ఇష్టానుసారంగా బూతులు తిట్టడంతో వారు రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం

చేర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తజనసందోహంగా మారాయి. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని పులకించిపోయారు. నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. తమ కోర్కెలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. స్వామి వారి దర్శనంకోసం సుమారు 2 గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూర్ణ, ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్ రెడ్డి, శ్రీరాములు తదితరులు పర్యవేక్షించారు.



గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తులు
















గుట్టకాయస్వాహా

కొండలు తొలిచి పరిశ్రమల స్థాపన


రామాయపల్లి శివారులో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న గుట్టలు

మనోహరాబాద్ మండలంలో కరిగిపోతున్న ప్రకృతి సంపద

భూములు కోల్పోతున్న స్థానికులు.. ఉపాధి లేక ఆవేదన

మనోహరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఎత్తైన గుట్టలు, వాటిని పరుచుకునే పచ్చదనం, వాటిని ఆవాసాలుగా చేసుకునే జీవరాశులు, గుట్టలను ఆనుకుని ఉండే పంట పొలాలతో ఉండే ప్రకృతి రమణీయత వర్ణించలేనిది. ఇలాంటి ఆహ్లాద వాతావరణంతో అలలారిన మనోహరాబాద్ మండలంలోని పల్లె శివారులు నేడు పరిశ్రమలకు అడ్డాగా మారిపోయాయి. గుట్టలను తొలిచి, వందలాది ఎకరాల వ్యవసాయ భూములను ఫ్యాక్టరీల ఏర్పాటు పేరుతో కబళిస్తున్నారు. మండల కేంద్రంలోనే కాకుండా,


కొండాపూర్ టీజీఐఐసీ పారిశ్రామికవాడలో పరిశ్రమ కోసం తొలుస్తున్న గుట్ట

ప్రతీ గ్రామ శివారులోనూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పుట్టుకొస్తునే ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 250కిపైగా పరిశ్రమలు మండలంలో వెలిశాయి. ఈ చర్యలతో ప్రకృతి సమతుల్యత దెబ్బతినడమే కాకుండా, భూములు కోల్పోయిన రైతులు, యువకులు ఉపాధి లేక రోడ్డున పడుతున్నారు. సొంత భూముల్లోనే కూలీలుగా మారిన స్థానికులకు పరిశ్రమల్లో కనీసం పనులు కూడా దొరకడం లేదు.

పరిశ్రమల విస్తరణ.. భూముల సేకరణ

మెదక్ జిల్లాలో మనోహరాబాద్ మండలం పరిశ్రమలకు కేంద్రబిందువుగా మారుతోంది. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పట్టా భూములను సేకరించి పరిశ్రమలకు కేటాయించడంతో ఈ విస్తరణ జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 1300 ఎకరాల వరకు భూములను పరిశ్రమల ఏర్పాటు కోసం సిద్ధం చేసింది. ముఖ్యంగా పోచారం, రంగయ్యపల్లి, కొనాపూర్, పర్కిబండ, వెంకటాపూర్ అగ్రహారం, ధర్మరాజ్‌పల్లి, పాలాట, రామయ్యపల్లి వంటి గ్రామాల్లో ఈ భూములను సేకరించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంకా కొత్త భూములను కేటాయించలేదు. గత ప్రభుత్వం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించింది. పర్కిబండ గ్రామంలో 350 ఎకరాల భూమిని సేకరించి, కేంద్ర ప్రభుత్వం లాజిస్టిక్ పార్క్ నిర్మాణం కోసం పునాదులు వేస్తోంది.

గుట్టలు కరిగి.. వ్యవసాయం తగ్గి

మనోహరాబాద్ మండలంలో సుమారు వెయ్యి ఎకరాలకుపైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటితో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, పట్టా భూములు, ముఖ్యంగా గుట్టలు ఉన్న ప్రాంతాలను సేకరించి పరిశ్రమల నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో మండలంలో ఎక్కడ చూసినా గుట్టలు కరిగిపోతూ, వాటి స్థానంలో పరిశ్రమలు వెలుస్తున్నాయి. ఒకప్పుడు పచ్చగా, గుట్టలతో నిండిన ఈ ప్రాంతం, ఇప్పుడు పరిశ్రమల కుప్పగా మారుతోంది. ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రకృతి సంపద పూర్తిగా కనుమరుగవుతుందని గ్రామాల్లోని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం పూర్తిగా పరిశ్రమలమయం కావడంతో వ్యవసాయ భూమి తగ్గిపోతుంది. దీంతో గ్రామాల్లోని రైతులు, యువకులు, కూలీలుగా మారుతున్నారు. ఒకప్పుడు పంటలు పండించి జీవనం సాగించిన రైతులు, ఇప్పుడు అదే భూముల్లో నిర్మించిన పరిశ్రమలలో కూలీలుగా పనిచేసుకుంటూ జీవించాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

భూములు కోల్పోయిన వారికి ఉపాధి చూపాలి



నేను పొలం పనులు చేసుకుంటూ జీవించేవాన్ని. గత ప్రభుత్వం పరిశ్రమల కోసం గ్రామంలో సుమారు 43 ఎకరాల భూమిని తీసుకుంది. దీంతో ఉన్న కొంత పొలం కోల్పోయాను. ఇప్పుడు భూములు లేక కూలీ పనులు చేయాల్సి వస్తుంది. పరిశ్రమల వారు మా భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ స్థానికులైన మాకు ఉపాధి కల్పించడం లేదు. అధికారులు భూములు కోల్పోయిన వారికి ఉపాధి చూపించాలి.

- గొల్ల యాదగిరి, రైతు, రంగయ్యపల్లి గ్రామం

పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి కల్పించాలి



మండలంలో వందల ఎకరాల్లో పరిశ్రమలు వెలుస్తున్నాయి. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి ప్రభుత్వం భూములు తీసుకున్నది. కానీ, ఇక్కడి యువతకు స్థానిక పరిశ్రమలలో అవకాశం కల్పించడం లేదు. ఇతర రాష్ట్రాల వారికే అవకాశాలు కల్పిస్తున్నారు. స్థానిక పరిశ్రమలలో మండల యువతకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి

- వెంకట్‌రెడ్డి, మనోహరాబాద్

కొనసాగుతున్న ఆషాఢి ఉత్సవాలు


రుక్మిని సమేత పాండురంగడు

మర్కుక్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం పాండురంగ ఆశ్రమంలో ఆషాఢి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తజన సంద్రంతో ఆశ్రమం కిక్కిరిసిపోయింది. భగవన్నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. పాండురంగ ఆశ్రమ నిర్వాహకులు చేపట్టబోయే శతకోటి హరే రామ నామజప యజ్ఞంలో భాగస్వాములవుతున్న 65 గ్రామాలకు చెందిన భగవత సేవా సమాజం శాఖల సభ్యులు శోభాయాత్రలతో ఆశ్రమానికి చేరుకొని భక్తజన సమ్మేళనంలో పాల్గొన్నారు. 108 గ్రామాలలో భజన మండలిని ఏర్పాటు చేస్తూ హరే రామ నామ స్మరణ ద్వారా భక్తి చైతన్యాన్ని ప్రచారం చేస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రసరాజశర్మ, ఒకేసారి వందలాది మంది స్నానం ఆచరించే విధంగా ప్రత్యేక పైప్‌లైన్లను ఏర్పాటు చేశారు. ఆదివారం రాంపూర్ పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతిస్వామివారు విచ్చేసి పాండురంగ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారు స్వయంగా భజన చెబుతూ భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో ఓలలాడించారు. సాదమంటపంపై సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. రాష్ట్రం నలుమూలలతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన సంగీత, సాహిత్య, సాంస్కృతిక కళాకారులు తమ ఆధ్యాత్మిక ప్రదర్శనల ద్వారా స్వామివారికి వందనం సమర్పించుకున్నారు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఇతర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పర్యావరణ పరిరక్షణకు క్విజ్

- ఎన్ఎస్‌పీఎస్-2025 రిజిస్ట్రేషన్లు షురూ
- ఐదు విభాగాల్లో పర్యావరణంపై ఆన్‌లైన్ క్విజ్
- ఆగస్టు 21 వరకు నమోదుకు అవకాశం
- జిల్లావ్యాప్తంగా విద్యాశాఖ అవగాహన కార్యక్రమాలు

సిద్దిపేట కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): 'ఈ నేచర్‌లో ఏది మన సొంతం కాదు. మనం భూమి మీద టెనెంట్స్ మాత్రమే. కొన్నాళ్లు ఉండటానికి వచ్చాం. ఉండి ఏది డిస్టర్బ్ చేయకుండా వెళ్లిపోదాం. తర్వాత తరానికి ఉన్నది ఉన్నట్లుగా ఇచ్చేయాలి.' ఇది ఒక తెలుగు సినిమాలోని డైలాగ్. ప్రస్తుతం ప్రకృతి విధ్వంసాన్ని చూస్తే ఆ డైలాగ్ అక్షర సత్యంగా అనిపిస్తుంది. గత 200 ఏళ్లలో జరిగిన ప్రకృతి విధ్వంసం కొన్ని మిలియన్ సంవత్సరాల్లో ఎప్పుడూ జరగలేదని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వాడకం, డిస్పోజబుల్స్, శిలాజ ఇంధనాల వినియోగం, కాలుష్యం, అడవుల నరికివేత వంటి మానవ తప్పిదాల వల్ల ప్రకృతికి పూడ్చలేని లోటు ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఫోన్‌లో టాక్‌టైమ్ పూర్తయినట్టే భూమి లైఫ్‌టైమ్ మనిషి చేస్తున్న ప్రకృతి విధ్వంసంతో తరిగిపోతుందని, రాబోయే తరాలకు ప్రకృతిని ఎలా కాపాడుకోవాలో నేర్పాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని నేచర్ లవర్స్ అభిప్రాయపడుతున్నారు.

ఎన్ఎస్‌పీఎస్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ

వాతావరణ మార్పుల నుంచి రక్షణకు, విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు పెంపొందించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చడానికి కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో పర్యావరణ గతివిధి (పీఎస్‌జీ) హరిత్ ద వే ఆఫ్ లైఫ్ అనే థీమ్‌తో దేశవ్యాప్తంగా ఎన్ఎస్‌పీఎస్ - 2025 (నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్)ను నిర్వహిస్తోంది. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు ఈకో మిత్రం మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. హిందీ, ఇంగ్లీష్‌తో పాటు పలు భాషల్లో క్విజ్ ఉంటుంది. మొక్క నాటుతున్న, నీరు ఆదా చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీని తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫలితాలను ఆగస్టు 31న ప్రకటిస్తారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఈ-సర్టిఫికెట్ అందజేస్తారు. విద్యా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హైమావతి, విద్యాశాఖ అధికారులు

ఐదు విభాగాల్లో పోటీ

ఈ క్విజ్ పోటీలో విద్యార్థులు మాత్రమే కాకుండా ప్రకృతి ప్రేమికులందరూ పాల్గొనవచ్చు. మొదటి విభాగంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులు, రెండవ విభాగంలో 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు, మూడవ విభాగంలో 9వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులు, నాల్గవ విభాగంలో డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, ఐదవ విభాగంలో సాధారణ పౌరులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొనవచ్చు. గత నాలుగేళ్లుగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఈ క్విజ్ పోటీల్లో పాల్గొంటున్నారు. అయితే సిద్దిపేట జిల్లా నుంచి ప్రాతినిధ్యం అంతగా లేదు. ఈ సంవత్సరం పెద్ద ఎత్తున జిల్లా నుంచి పోటీలో పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిద్దిపేట కలెక్టర్ హైమావతి ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు.

అవగాహన కల్పించాలి

పిల్లలకు ప్రకృతికి హాని చేసే అంశాల పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించాలి. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఎన్ఎస్‌పీఎస్-2025లో అందరూ భాగస్వామ్యం అయ్యేలా చూడాలి. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి.

- భాస్కర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, నేషనల్ గ్రీన్‌కోర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

మెదక్ చర్చిని సందర్శించిన ఐఏఎస్ నవీన్ నికోలాస్

మెదక్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చిని ఆదివారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఐఏఎస్ నవీన్ నికోలాస్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి మత పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట చర్చి కమిటీ సభ్యులు టి. శాంతయ్య, సామ్సన్ బాని, సువాన్, రూపేందర్ ఉన్నారు. అనంతరం మెదక్ జిల్లా పీఈటీ, పీడీలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మెదక్‌లోని కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌ల్లో స్పోర్ట్స్ అకాడమీలను నెలకొల్పాలని ఆయనకు విన్నవించారు. కార్యక్రమంలో పెటా-టీఎస్ మెదక్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, నాగరాజు పీడీలు మాధవరెడ్డి, రవి, రూపేందర్, మహిపాల్, మనోహర్, లక్ష్మణ్, ప్రభాకర్, హరీష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



రెండేళ్లుగా బడికి తాళం

డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయురాలు.. రంజానాయక్ తండాలో మూతపడిన పాఠశాల


రేగోడు మండలం రంజా తండాలో మూతబడిన బడి

రేగోడు జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, వసతులు, ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపం పాఠశాలలకు శాపంగా మారుతుంది. రేగోడు మండలంలోని రంజానాయక్ తండా ప్రాథమిక పాఠశాల రెండేళ్లుగా మూతపడింది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై పక్క జిల్లాకు పంపించడంతో బడికి తాళం పడింది.

రేగోడు మండలంలో ఇప్పటికే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. సగానికిపైగా ఒకే ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఉపాధ్యాయులు సెలవుపై వెళ్తే ఆరోజు ఆ బడికి సెలవు ప్రకటించాల్సిందే. అలాంటి పరిస్థితులు ఉన్న రేగోడు మండలంలో ఉపాధ్యాయులను ఇతర జిల్లాలకు డిప్యూటేషన్ వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంజానాయక్ తండా పాఠశాల మూతపడడంతో అక్కడి విద్యార్థులను బురన్‌వాడీ తండా పాఠశాలకు పంపించారు. రంజానాయక్ తండాలో 20 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం ఐదుగురు మాత్రమే బురన్‌వాడీ తండాకు వెళ్లి చదువుతున్నారు. మిగిలిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు, ఇతర పాఠశాలకు వెళ్తున్నారని తండావాసులు తెలిపారు.

చాలా మంది పిల్లలు తండాలోనే తిరుగుతున్నారు



రంజానాయక్ తండాలో సర్కారీ బడి రెండేళ్లుగా మూతబడింది. పిల్లలను పక్క తండా బురన్‌వాడీ పాఠశాలకు పంపిస్తున్నాం. చాలామంది పిల్లలు బడికి పోకుండా తండాలోనే తిరుగుతున్నారు.

-రవినాయక్, రంజానాయక్‌తండా

వేర్వేరుగా రిజిస్టర్లు

రంజానాయక్ తండా నుంచి వచ్చిన విద్యార్థులకు చదువుతోపాటు బుక్స్ మధ్యాహ్న భోజనం పెట్టిస్తున్నాం. బురన్‌వాడీ, రంజానాయక్ తండాల విద్యార్థులకు వేర్వేరుగా రిజిస్టర్లను నమోదు చేస్తున్నాం. రంజా తండా నుంచి అందరు విద్యార్థులు సరిగా రాలేకపోతున్నారు.

- శిరీష, హెచ్ఎం బురన్‌వాడీతండా పాఠశాల

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ పూర్తి

నంగునూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో బీటెక్ కోర్సుల ప్రవేశానికి నిర్వహిస్తున్న ఎప్‌సెట్ కౌన్సిలింగ్ ఆదివారం ముగిసినట్లు ప్రిన్సిపల్ గోవర్ధన్ తెలిపారు. మొత్తం 1833 విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకాగా, ఆదివారం ఒక్కరోజే 215 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి, లాగిన్ ఐడీ కేటాయించి వెబ్ ఆప్షన్స్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కౌన్సిలింగ్ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల అధ్యాపకుడు శ్రీ అభినవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో సిబ్బంది సయ్యద్ షేహబాజ్, పాతూరు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, రాజు, విజయ్ కుమార్, శ్రీనివాస్, రాజమౌళి, మధుబాబు, సంతోష్, నవీన కిషోర్, ధనరాజ్, కవిత, మంజుల, వాణి, దీపిక, భాగ్యలక్ష్మి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో నిర్వహిస్తున్న సిబ్బంది

అథ్లెటిక్స్‌లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు



బంగారు పతకాన్ని అందుకున్న క్రీడాకారుడు గాడిచర్ల జితీష్


కాంస్య పతకాన్ని అందుకున్న పునీత్ గౌడ్

సిద్దిపేట క్రైమ్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హన్మకొండలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు దక్కాయి. అండర్-10 బాలుర విభాగంలో జిల్లాకు చెందిన క్రీడాకారుడు గాడిచర్ల జితీష్ స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో బంగారు పతకం సాధించాడు. అండర్-12 బాలుర విభాగంలో కొండపాక తెలంగాణ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన పునీత గౌడ్ లాంగ్ జంప్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, వెంకటనరసయ్య, పన్యాల రామేశ్వర్ రెడ్డి, ఏరవ్వ అశోక్, సైక్లింగ్ జిల్లా సంఘం అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, రెజ్లింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, శిక్షకులు నిశాంక్ గౌడ్, ప్రభాకర్ తదితరులు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఏడుగురు ఎంపిక


ఎంపికైన బాలికలు, బాలురు



చేగుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రగ్బీ పోటీలకు మెదక్ జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు మెదక్ జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్ణం గణేష్ రవికుమార్, మల్లేశ్వరి తెలిపారు. ఈ నెల 5న సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-18 బాలబాలికల రగ్బీ పోటీల నుంచి వీరు ఎంపికయ్యారు. చేగుంట ఎస్టీ స్పోర్ట్స్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన నలుగురు క్రీడాకారులు, తూప్రాన్ బాలుర గురుకుల కళాశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు జాతీయస్థాయి రగ్బీ పోటీలకు అర్హత సాధించారు. బాలికల విభాగంలో నందిని, దీపిక, సంపూర్ణ, అంకిత ఎంపిక కాగా, బాలుర విభాగంలో విష్ణు శ్రీ చరణ్, రాకేష్, కార్తీక్ ఎంపికయ్యారు. బాలుర విభాగం ఈ నెల 8 నుంచి 10 వరకు, బాలికల విభాగం 12 నుంచి 14 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగే జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల నుంచి క్రీడాకారులు జాతీయస్థాయిలో ఎంపిక కావడం పట్ల స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సుమతి, బాలుర కళాశాల ప్రిన్సిపల్ తారాసింగ్ హర్షం వ్యక్తం చేశారు.

రియల్ వ్యాపారి మోసం

- కోనాపూర్‌లో 35.19 ఎకరాలు కాజేసేందుకు యత్నం
- తమ కుటుంబ సభ్యుల పేర అక్రమ రిజిస్ట్రేషన్
- 50 ఏళ్ల నుంచి కబ్జాలో ఉన్న రైతులకు బెదిరింపు


కోనాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సదానందం

దౌల్తాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామంలోని 35.19 ఎకరాల భూమిని హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంట్రాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌రావు కాజేయాలని చూస్తున్నట్లు గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని 134సర్వే నంబర్‌లో మొత్తం 200 ఎకరాల 18 గుంటల భూమి ఉంది. ఇందులో 2016లో కొండపోచమ్మ రిజర్వాయర్‌లో 13 ఎకరాలు పోగా, మిగిలిన భూమిలో 10 ఎకరాలు గంటన కుంట, చిన్న కుంటలు ఉన్నాయి. ఇదే సర్వే నంబర్‌లోని సుమారు 10 ఎకరాల్లో కోనాపూర్ గ్రామానికి చెందిన కొంత మంది రైతులు 50 ఏళ్లుగా ఎటువంటి రిజిస్ట్రేషన్ చేసుకోకుండా సాగు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితిని అదునుగా భావించిన పుల్లూరి శ్రీనివాస్‌రావు తన పేరిట 10 ఎకరాల 26 గుంటలు, తన తండ్రి పుల్లూరి రాజేశ్వర్‌రావు పేరిట 10 ఎకరాలు, తన భార్య పుల్లూరి సరిత పేరిట 14ఎకరాల 33 గుంటలను అక్రమంగా నకిలీ పాత పాస్‌బుక్‌లు, నకిలీ 13(బి) ప్రొసీడింగ్‌లను సృష్టించి 2018లో రికార్డుల్లో ఎక్కించుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. శ్రీనివాస్‌రావుకు, ఆయన కుటుంబానికి ఆ భూమిపై ఒక్క గుంట కూడా కబ్జా లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. గ్రామానికి ఒకరిద్దరు శ్రీనివాస్‌రావుకు సహకరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

సర్వేను అడ్డుకున్న రైతులు

ఈ నెల 5న పుల్లూరి శ్రీనివాస్‌రావు తన భూమిగా పేర్కొంటూ సర్వేయర్లు, అధికారులతో కలిసి 10 ఎకరాలను సర్వే చేసేందుకు రావడంతో రైతులు అడ్డుకున్నారు. తాము సాగు చేసుకుంటున్న భూమిలో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారు. తాము శ్రీనివాస్‌రావుకు ఒక్క గుంట భూమి కూడా అమ్మలేదని, తమకు ఆయన ఎవరో తెలియదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తమకు పట్టా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గతంలో ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. సమాచారం అందుకున్న సిద్దిపేట ఆర్డీఓ సదానందం, దౌల్తాబాద్, రాయపోల్, తొగుట, బేగంపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినకపోవడంతో అధికారులు వెనుదిరిగారు.

న్యాయం చేయాలి..



పుల్లూరి శ్రీనివాస్‌రావుకు, 134సర్వే నంబర్‌కు ఎలాంటి సంబంధం లేదు. మా భూముల్లో సర్వే చేయడానికి రావడం అన్యాయం. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌రావు, అతని కుటుంబం పేర్లపై ఉన్న ఈ భూములను తొలగించి, మాకు న్యాయం చేయాలి.

- రాజిరెడ్డి, రైతు, కోనాపూర్

కూల్చివేతలు.. కూలీల కొరత

- చేర్యాలలో కూలీలకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్
- స్థానికంగా కొరత
- మరమ్మతుల కోసం ఇతర గ్రామాల నుంచి రప్పించుకునే యత్నాలు




కూల్చివేతతో సగానికిపైగా కోల్పోయిన భవనాలు, భవన పైకప్పులు కూల్చివేస్తున్న కూలీలు

చేర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో ఎక్కడ నలుగురు గుమిగూడినా ఇళ్లు, భవనాల కూల్చివేతల విషయమై చర్చించుకుంటున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా డ్రిల్లింగ్ పనులు, సుత్తె, గన్ను, గడ్డపారల మోతలు కనిపిస్తున్నాయి. రోడ్డువిస్తరణలో ఎవరి భవనాలకు ఏమేర నష్టం జరుగుతుంది.. కూల్చితే మరమ్మతులు ఎవరితో చేయిస్తున్నారు.. కూలీలు దొరుకుతున్నారా.. కూలీ ఎంత ఇస్తున్నారనే విషయాలు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా భవన యజమానులకు కూలీల కొరత తీవ్ర సమస్యగా మారింది. వివరాల్లోకి వెళ్తే..

కూలీలకు పెరిగిన డిమాండ్

సూర్యాపేట-సిరిసిల్ల 365బీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేర్యాల ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల వెడల్పుతో గతంలో మార్కింగ్ వేయగా, కొన్నాళ్ల క్రితం 45 ఫీట్ల లోపు కూల్చివేసి డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. మిగతా 5 ఫీట్ల నిర్దేశిత ప్రదేశంలోని నిర్మాణాలు తొలగింపునకు మునిసిపల్, ఎన్‌హెచ్ అధికారులతో పాటు కాంట్రాక్టర్ ఇటీవల కూల్చివేతలు ప్రారంభించడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, షాపుల యజమానులు కూల్చివేత భాగాలను సరిదిద్దుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో కూలీల కొరత తీవ్రమైంది. కూలీలకు డిమాండ్ పెరగడంతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముంచుకొస్తున్న గడువు

పట్టణంలో సుమారు కిలో మీటరున్నర పొడవునా పలు భవనాలు, ఇళ్లు కూల్చివేతకు గురయ్యే పరిస్థితి నెలకొనడంతో ఒక్కసారిగా భవన నిర్మాణరంగ కూలీలు, మేస్త్రీల అవసరం ఏర్పడింది. రెండు, మూడు రోజుల్లోగా కూల్చేసుకోవాలని, లేదా తామే కూల్చివేస్తామని కాంట్రాక్టర్ గడువు ఇవ్వడంతో ఇళ్లు, షాపుల యజమానులు కూలీల కోసం పరుగులుపెడుతున్నారు. పలువురు పనులు చేపట్టినప్పటికీ, కూలీల కొరత, గిట్టుబాటు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా కూలీల కొరత, కూలి రేట్లు భరించలేక పొరుగు గ్రామాలకు చెందిన వారితో పని చేయించుకునేందుకు యత్నాలు ముమ్మరం చేశారు.



తక్కువ గ్యాప్‌తో డివైడర్ల్‌లో ఏర్పాటు చేసిన గ్రిల్స్, ఏపుగా పెరిగిన చెట్లు

ఆదమరిస్తే అంతే..

చేర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో చేపట్టిన జనగామ-సిద్దిపేట ప్రధానదారి విస్తరణలో కొన్నాళ్లక్రితం డివైడర్లలో ఏర్పాటు చేసిన గ్రిల్స్ అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఏమాత్రం ఆదమరచినా ప్రాణాలు కోల్పోతున్న వరుస సంఘటనలతో వాహనదారులు, స్థానికులు బెంబేలెత్తుతున్నారు. జాతీయ రహదారి 365-బీ నిర్మాణంలో భాగంగా రోడ్డుమధ్య భాగంలో కొన్నాళ్లక్రితం అతితక్కువ ఎత్తులో డివైడర్ నిర్మాణం చేసి తక్కువ గ్యాప్‌తోనే ఇనుప గ్రిల్స్ ఏర్పాటుచేశారు. గతంలోకంటే రోడ్డు బాగుపడటంతో వాహనాలు దూసుకుపోతున్నాయి. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఇటీవల ప్రమాద ఘటనలు

జనగామ-సిద్దిపేట ప్రధానరహదారిపై స్థానిక ఎంపీఐ కార్యాలయం నుంచి పట్టణ శివారులోని ఇండేన్ ఆయిల్ పెట్రోల్‌పంప్ వరకు డివైడర్లలో గ్రిల్స్ ఏర్పాటుచేశారు. గ్రిల్స్ మధ్య దూరం తక్కువగా ఉండటానికి తోడు డివైడర్లలో నాటిన కోనోకార్పస్, ఇతరత్రా మొక్కలు ఏపుగా పెరిగాయి. గ్రిల్స్ చెట్లకొమ్మలు ఊగిసలాడుతున్నట్లు కనిపిస్తుండటంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. కొద్దిరోజులక్రితం పట్టణానికి చెందిన శివ, వెంకటేశ్ చుంచనకోట క్రాస్‌రోడ్డునుండి వస్తుండగా అయోమయానికి గురై బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానిక కోర్టు ఆవరణలో వాహనం అదుపుతప్పి ముస్త్యాలకు చెందిన ఓ వ్యక్తి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. మూడు రోజులక్రితం మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరి నర్సింహారెడ్డి టూవీలర్‌పై ప్రయాణిస్తూ స్థానిక అయ్యప్పస్వామి దేవాలయ సమీపంలో డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కారు ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కారు, ఆటో ఢీ కొన్న సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. నిత్యం ఏదో ఓ ప్రదేశంలో ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో ఈదారి వెంబడి వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతు న్నారు. ఎన్‌హెచ్, మునిసిపల్, పోలీస్ అధికారులు చొరవ వహించి గ్రిల్స్ సవరించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గజ్వేల్‌లో ఘనంగా మహంకాళీ బోనాలు



మహంకాళీ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

గజ్వేల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో శ్రీ మహంకాళీ దేవాలయ బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారిని పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం అలంకరణ, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారికి బోనాలను సమర్పించి, ఓడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కోహెడ బీజేపీ నాయకులు

కోహెడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్‌ని మండల బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో కేంద్రమంత్రిని కలిసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్, జిల్లా పార్టీ కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం తెలిపారు. వెంకటేశ్వరపల్లి పెద్దమ్మ ఆలయం, సిసిపల్లిలో బ్రహ్మంగారి ఆలయం, బస్వాపూర్‌లో మాంకాళమ్మ, తంగళ్లపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయాల్లో బోర్ మోటార్‌లను మంజూరు చేయాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి 15 రోజుల్లోనే బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు. కేంద్రమంత్రిని కలిసినవారిలో బీజేపీ నాయకులు కంది సత్యనారాయణరెడ్డి, సామల గిరిధర్, ఎ రాజుచారి, వెంకటేష్, మంద రమేష్, పండుగ మల్లయ్య, డి రాజు, లచ్చయ్య, బొజ్జ రమేష్, తదితరులున్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి




సిద్దిపేట బీజేపీ కార్యాలయంలో, హుస్నాబాద్‌లో శ్యామాప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేట క్రైం/హుస్నాబాద్/చిన్నకోడూరు/చేర్యాల/బెజ్జంకి , జూలై 6 (ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ 124వ జయంతి వేడుకలను ఆదివారం పలు మండలాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాలు, కూడలి ప్రాంతాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా నినాదాన్ని బలంగా వినిపించి, జాతీయవాద ఆలోచనను ప్రోత్సహించిన మహోన్నత వ్యక్తి శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. సిద్దిపేట జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పార్టీ నాయకులతో కలిసి శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో నేటి యువత నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి, వంగ రామచంద్రారెడ్డి, బాసంగారి వెంకట్, కాసనగొట్టు సంతోష్, గుండ్ల జనార్ధన్, తోడుపునూరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, వడ్డెపల్లి లక్ష్మయ్య, నాయకులతో కలిసి శ్యామాప్రసాద్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

చిన్నకోడూరులో బీజేపీ మండలాధ్యక్షుడు సూరగోని శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో, చేర్యాలలో పార్టీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎల్లమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటారు.

ఉప్మాలో పురుగు



గజ్వేల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్లలో రాజీవ్ రహదారిపై గల శ్రీరాఘవేంద్ర హోటల్‌లో కస్టమర్‌కు ఇచ్చిన ఉప్మాలో పురుగు(గడ్డి పురుగు) ప్రత్యక్షమైంది. కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లికి చెందిన ఓ వ్యక్తి ఉదయం టిఫిన్ చేసేందుకు రాగా, ఉప్మాలో పురుగు కనిపించడంతో నిర్ఘాంతపోయాడు. విషయాన్ని యాజమాన్యానికి తెలుపగా ఏం చేసుకుంటావో చేసుకో అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారని వాపోయాడు.

జీవో 282ను రద్దు చేయాలి



జీవో కాపీని కాల్చి వేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

గజ్వేల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం పది గంటల పని అమలు చేసుకోవచ్చని తీసుకువచ్చిన జీవో 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు శివలింగు కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 282 కాపీలను ఆదివారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక కోడ్‌లను రూపొందించడంతో దానికి అనుగుణంగా రాష్ట్రాలు నూతనంగా రూల్స్ తయారు చేస్తున్నాయని విమర్శించారు. కర్ణాటక 12గంటలు, గుజరాత్ పది గంటలు పని అమలు చేయాలని ఇప్పటికే జీవో విడుదల చేశాయని, తాజాగా తెలంగాణ ప్రభుత్వం వారానికి 48గంటలు అని చెబుతూనే దుకాణాల్లో 10గంటల పని చేసుకోవచ్చంటూ జీవో 282ని జారీ చేసిందన్నారు. ప్రభుత్వ పునః పరిశీలన చేసి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి, రాజులు, రామారావు, పోషయ్య, శ్రీనివాస్, రమణాకర్ తదితరులున్నారు.

న్యూస్ బాక్స్

సమ్మర్ క్యాంపు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లతో విద్యార్థులు

గజ్వేల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సమ్మర్ క్యాంపును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంగారి గణేశ్, కోచ్ నర్సింలు, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుగుణాకర్‌రెడ్డి, చక్రపాణి, సందబోయిన ఎల్లయ్య, శ్రీకాంత్ తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

చేర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన గుస్క రవి(42)ఆదివారం హఠాన్మరణం చెందాడు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ బీఆర్‌ఎస్ గ్రామకమిటీ ఆధ్వర్యంలో రూ.12,500నగదును మాజీ ఎంపీపీ పుల్లంపల్లి కరుణాకర్, మాజీ సర్పంచు బండమీది సంతోషికరుణాకర్ తదితరులు మృతుడి కుటుంబానికి ఆర్థికసహాయం అందించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

ములుగు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ బాధ్యుడు బుడిగె మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ములుగులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూలై 7న జిల్లావ్యాప్తంగా ప్రతి ఒక్కరూ సమయాన్ని పాటించి ఉదయమే అన్ని గ్రామాల్లో కమిటీ సభ్యులు, కులస్తులతో కలిసి ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి



గజ్వేల్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఆదివారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల ఓటు హక్కు కోసం అమ్మ కమిషన్ ఎదుట తన వాదనలు వినిపించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అజహర్, మోహన్నగారి రాజు, నక్క రాములు, సుఖేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

- **కోహెడ:** బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త పిడిశెట్టి రాజు, మంద మల్లేశం, మాజీ ఎంపీటీసీ తిప్పారాపు నాగరాజు, డాక్టర్ జయశంకర్, తదితరులున్నారు.

అంగడిబజారులో మునిసిపల్ కార్యాలయాన్ని నిర్మించాలి

చేర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మునిసిపల్ కార్యాలయ భవనాన్ని స్థానిక అంగడిబజారులోనే నిర్మించి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీరాష్ట్ర నాయకుడు అందె బీరన్న పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రజలకు అందుబాటులో ఉన్న భవనాన్ని అనాలోచిత విధానంతో కూల్చివేసి పట్టణ శివారులో అస్తవ్యస్తపరిస్థితుల నడుమ కొనసాగిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్పందించి అంగడిబజారులో మునిసిపల్ కార్యాలయ భవనం నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఆపదలో సఖీ ఆత్మబంధువు

(5వ పేజీ తరువాయి)

సమాచారం అందితే, సఖీ కేంద్రం సిబ్బంది వారిని తీసుకువచ్చి అనాథ ఆశ్రమాలకు చేరుస్తారు. ఈ విధంగా సఖీ కేంద్రం మహిళల భద్రతకు, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుంది.

ఐదు రకాల సేవలు..

బాధిత మహిళలకు సిద్దిపేట సఖీ కేంద్రం ఐదు రకాల సేవలను అందిస్తుంది. ఫ్యామిలీ కౌన్సెలింగ్, మహిళలకు వైద్య సహాయం, ఉచిత న్యాయ సలహా, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతిని కల్పిస్తున్నారు. సఖీ కేంద్రానికి వచ్చిన అనాథ మహిళలకు ఐదురోజులు వసతి కల్పించిన అనంతరం వారిని కరీంనగర్‌లోని శక్తి సదన్ ఆశ్రమానికి తరలిస్తారు. వీటితోపాటు ఆ మహిళ స్వశక్తిగా ఎదిగేందుకు ఉద్యోగ శిక్షణను టైలరింగ్, వివిధ రకాల శిక్షణను అందిస్తారు. సఖీ కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 181కు కాల్ చేసినా, లేదా నేరుగా కేంద్రాన్ని ఆశ్రయించినా సిబ్బంది వెంటనే స్పందిస్తారు. బాధిత మహిళలు కేంద్రానికి రాలేని పరిస్థితి ఉంటే, సఖీ కేంద్రం వాహనం వారి వద్దకు చేరుకుని తీసుకువస్తుంది. కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను కూడా సఖీ కేంద్రానికి పంపిస్తారు. 12 మంది సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ, బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తారు.

సఖీ కేంద్రం పరిష్కరించినవి కొన్ని..

- జిల్లాకు చెందిన ఉద్యోగం చేస్తున్న మహిళ, అత్తవారింట్లో భర్తతో, పిల్లలతో కలిసి జీవిస్తోంది. ఆమె భర్త రోజూ తాగి వచ్చి వేధించేవాడు. అత్త ఆ మహిళపై ఆధిపత్యం చెలాయిస్తూ, ఆమె సంపాదించిన డబ్బును వాడుకుంటూ వేధింపులకు గురిచేసేది. డబ్బు ఖర్చుకాకూడదని, పిల్లలను ప్రభుత్వ స్కూల్లో చదివింపజేశారు. పిల్లలు ఉన్నత చదువులు చదవలేక పోతారని మానసిక ఆందోళనకు గురైన ఆ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడే స్థితిలో సఖీ కేంద్రాన్ని ఆశ్రయించింది. సిబ్బంది ఆ కుటుంబాన్ని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ పిల్లల్ని ప్రైవేట్ స్కూల్లో చదివిపిస్తానని ఆ మహిళ భర్త ఒప్పందం చేసుకొని, సమస్యను పరిష్కరించారు.
- సిద్దిపేట పట్టణానికి చెందిన ఒక మహిళ తన భర్త రోజూ తాగి వచ్చి కొడుతున్నాడని, సఖీ కేంద్రాన్ని ఆశ్రయించింది. కేంద్రం సిబ్బంది వెంటనే భర్తను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతేకాకుండా, అతనికి తాగుడు అలవాటు మాన్పించడానికి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని డీఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు.
- సిద్దిపేటకు చెందిన మహిళ తన భర్త, అత్త వేధింపులు భరించలేక పిల్లలతో సహా విడిగా ఉంటోంది. తన పిల్లలను స్కూల్లో చేర్పడానికి అవసరమైన ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు అత్తవారింట్లో ఉండిపోవడంతో ఆందోళన చెందింది. ఆ మహిళ సఖీ కేంద్రాన్ని ఆశ్రయించింది. సఖీ సిబ్బంది వెంటనే ఆమె అత్తగారింటికి వెళ్లి, వస్తువులను, పిల్లల సర్టిఫికెట్లను తీసుకువచ్చి ఆమెకు అప్పగించారు.

మళ్లీ 'నామినేటెడ్' ఆశలు

(5వ పేజీ తరువాయి)

నాయకులు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు మారడం, బయటి నాయకుల జోక్యం వంటివి ఆందోళనను మరింత పెంచుతున్నాయి. ఇటీవల గజ్వేల్‌లో నామినేటెడ్ పదవుల విషయంలో జరిగిన పరిణామాలు చూస్తుంటే, పదవులు కష్టపడ్డవారికా లేక ఇతర పార్టీల నుంచి వచ్చి వచ్చిన వారికా అన్న సందేహం స్థానిక నాయకుల్లో వ్యక్తమవుతోంది.

జూలై చివరి వారంలో కసరత్తు పూర్తి

జూలై చివరి వారంలోపు జిల్లావ్యాప్తంగా నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేసిన పేర్లను సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ పెద్దలు పరిశీలించనున్నారు. అనంతరం ఆగస్టు మొదటి వారంలో ఆయా పదవులకు పేర్లను ప్రకటించే అవకాశాలున్నాయి. చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు డైరెక్టర్లు వంటి వందల సంఖ్యలో పదవులు కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు లభించే అవకాశం ఉంది. గతంలో అనేకసార్లు వాయిదా పడిన ఈ ప్రక్రియ ఈసారైనా పూర్తవుతుందా లేదా అని పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేచరేణి జడ్పీఎస్ఎస్ పూర్వవిద్యార్థులు

చేర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం వేచరేణి జడ్పీఎస్ఎస్ 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం సందడి చేశారు. స్థానిక వీరభద్రగార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. చాలాకాలం తర్వాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఆడిపాడి సందడి చేశారు.

గరుడ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఆలయ, విగ్రహ కమిటీ సభ్యులు

బెజ్జంకి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో గరుడ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం ఆలయ, విగ్రహ కమిటీ సభ్యులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ మాట్లాడుతూ బెజ్జంకిలో గరుడ విగ్రహం ఏర్పాటు చేయడం విశేషమని, తిరుపతి, కాకినాడల తర్వాత ఇక్కడ ఏర్పాటు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ, విగ్రహకమిటీ సభ్యులు, ఆలయ ప్రధానర్చకుడు, భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల కొరతతో రైతులకు ఇబ్బందులు



బెజ్జంకిలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బెజ్జంకి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పంటలసాగు సమయంలో ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తుందని సీపీఎం పార్టీ బావిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతుల పట్ల మొండిగా వ్యవహరిస్తూ రాష్ట్రానికి ఎరువుల కోటాను తగ్గించిందని తెలిపారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, సాయికృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి




సిద్దిపేట శ్రీవెంకటేశ్వరాలయంలో భక్తుల పూజలు, గజ్వేల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి విగ్రహాలకు పల్లకిసేవ



దుబ్బాకలోని విఠలేశ్వరాలయం చావా ఊరేగింపు

సిద్దిపేట కల్చరల్/దుబ్బాక/తొగుట/చేర్యాల/వర్గల్/గజ్వేల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజల సందడి నెలకొన్నది. సిద్దిపేటలోని శ్రీవెంకటేశ్వరాలయం, కోటి లింగాల ఆలయంతో పాటుగా హనుమాన్ ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు మొదలు కాగా భక్తులు దైవదర్శనం కోసం బారులు తీరారు. దుబ్బాకలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అలాగే విఠలేశ్వరాలయంలో భక్తులు స్వామివారి చావాఊరేగింపులో పాల్గొని స్వామివారిని ఊరేగించారు. తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి అర్చన, తులసి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చేర్యాల వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృత స్నపన తిరుమంజసం జరిపారు. అనంతరం విష్ణుపారాయణం, భగవద్గీత పారాయణం నిర్వహించారు. కాగా తొలి ఏకాదశి సందర్భంగా మర్కుక్ పాండురంగాశ్రమంలో నిర్వహిస్తున్న ఆషాఢీ ఉత్సవాలకు చేర్యాల నగర సంకీర్తన భక్తసమాజం ఆధ్వర్యంలో భక్తులు ఆశ్రమం వరకు బైక్‌లపై ర్యాలీగా తరలివెళ్లారు. వర్గల్ మండలం నుంచి ప్రజలు, గీతాజ్ఞానమండలి సభ్యులు మర్కుక్ పాండురంగాశ్రమానికి తరలివెళ్లి అక్కడ నిర్వహించిన భజనలో పాల్గొన్నారు. గజ్వేల్‌లోని శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పల్లకి సేవ నిర్వహించారు. మహిళా భక్తుల కోలాటాలు ఆకట్టుకున్నారు.



చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో విష్ణుపారాయణం చేస్తున్న భక్తులు



చేర్యాల నుంచి మర్కుక్ పాండురంగాశ్రమానికి బైక్ ర్యాలీగా వెళ్తున్న నగర సంకీర్తన భక్తసమాజం



మర్కుక్ పాండురంగాశ్రమానికి తరలిన వర్గల్ గీతాజ్ఞానమండలి సభ్యులు